రావులపాటి రవళి

సమకాలీన సంకుచిత విలువలపై వ్యంగ్యాస్త్రం!

# అనుభవం



రమ్య అసంతృప్తికి ఒక కారణం ఉంది. తండ్రి వర్ధనరావు తన ప్రేమ సంగతి తేలిగ్గా తీసుకుంటున్నాడు. అప్పటికే కృష్ణను ప్రత్యేకంగా పరిచయం చేసింది కూడా.

ఆకుకు అందనట్లు పోకకు పొందనట్లు తండ్రి ఉన్నాడు. ఏ అభిప్రాయం వ్యక్తం చేయకపోయే సరికి కృష్ణ కంగారు పడ్డాడు.

"రమ్యా! మీ నాన్న ఒప్పుకోడేమో?" అన్నాడు నిరాశ నిండిన కంఠంతో.

"ఛ!ఛ! అదేం కాదు. మానాన్న తీరే అంత! నీకెందుకూ... సాయంత్రం వరకల్లా ఏదో ఒకటి తేల్చేస్తాగా!" అంది రమ్య. మనసులో ఆమెకూ సందేహం క్రమ్ముకుంది.

తండ్రి ఒప్పుకోడనే భయం కూడా మనసులో ఓమూల చోటు చేసుకుంటున్నది.

ఆ సాయంత్రం తండ్రి తీరిగ్గా గులాబీ తోటలో ఉన్నప్పుడు అడిగింది.

"నాన్నా..."

"చెప్పు రమ్యా?"

"నీకు... నీకు"

"నాకు... ఏమిటమ్మా? చెప్పు?"

"నీకు కృష్ణ నచ్చాడా?"

"నచ్చకేం! బ్రహ్మాండంగా నచ్చాడు"

ఆ మాటలతో ఆమె గులాబీ బాలగా మారిపోయింది. తండ్రికి నచ్చడం అనేది ఒక పెద్ద ఎచీవ్‌మెంటు. ఎంతో ఎక్సయిటింగ్‌గా "నాకు తెలుసు నాన్నా! నీకు తప్పకుండా నచ్చుతాడని! నామాట నువ్వు తీసేయవని నాకు తెలుసు నాన్నా"... అంది ఎంతో సంతోషంతో... ఉద్వేగంతో!

వర్ధనరావు కూతుర్ని తదేకంగా చూస్తూ అన్నాడు.

"అమ్మా... నువ్వు అతడు నచ్చడని ఎందుకనుకున్నావు?"

"ఏమో నాన్నా! నీవు ప్రతిదానికీ నీ అనుభవాన్ని జోడించి బేరీజు వేస్తావు అందుకనే నాకు అనుమానం అన్పించింది" చీరె చెంగును మెలి తిప్పుతూ చెప్పింది.

"నీవు చెప్పింది నిజమే నమ్మా! పరాయి కుర్రాడిగా అతడు నాకు నచ్చాడు... కానీ..."

"కానీ" అంత సంతోషం ఆవిరిలా కారిపోయి భయంతో అడిగింది.

"కానీ... నీ భర్తగా నాకు నచ్చేయోగ్యత లేదమ్మా"... నెమ్మదిగానే చెప్పాడు...

"ఎందుకని?" ఛ్రున అడిగింది.

"ఎందుకంటే ఏం చెప్పను? ఈ గులాబీని చూడు. ఎంత అందంగా... ముద్దుగా... సుతిమెత్తగా ఉందో... పువ్వుకింద ముళ్ళు ఉంటాయని మన ఆలోచనలోకే రాదు... కానీ ఆ పువ్వు అందంతో తన్మయత్వంతో పడిపోతే ముళ్ళు మీదు గుచ్చుకుంటాయమ్మా"...

"ఏంటి నాన్నా! నువ్వు చెప్పేది! ఈ పువ్వుకూ కృష్ణకూ ఏమిటీ పోలిక?" కోపంగా అడిగింది.

"[illegible] మనోహరంగా కన్పించే ఆ అబ్బాయి... నా ఆస్తి వివరాలను గురించి వాకబు చేశాడని తెల్సిన తరువాత అతడు స్వార్థపరుడు అన్పించింది తల్లీ!

ప్రేమకు స్వార్థం అవసరమే! అది తన ప్రేయసికి సంబంధించినంత వరకే పరిమితం చేసుకోవాలి! ఆ స్వార్థం ఆస్తిని కూడా అల్లుకోబోతున్నదను కున్నప్పుడేనమ్మా... అనుభవంగల తండ్రిగా నేను ఆలోచించుకోవాలి!"

తండ్రి మాటలు వింటూ వెనకనే అలికిడి అవుతే చూసింది.

కృష్ణ ఉన్నాడు. ఎప్పుడు వచ్చాడో వాళ్ళిద్దరూ గమనించనే లేదు.

"మీరు అన్నమాటలు విన్నాను. నిజమే స్వార్థంతోనే నేను మీ ఆస్తిని గురించిన వివరాలు తెలుసుకున్నాను. బహుశా మీ అనుభవం నన్ను గురించిన వివరాలు తెల్సుకోనేట్లు చేయలేదేమో! బెంగుళూరులో మీకు రెండింతలు మించిన ఆస్తులున్నాయి! మానాన్నను మా అమ్మ ప్రేమించి చేసుకుంది. దురదృష్టవశాత్తు ఆయన బీదవాడు... ప్రతిక్షణం తమ గొప్పతనాన్ని చాటి చెప్పి ఆయన్ను దూరం చేసుకుంది... అందుకే అనుభవంమీద తెలుసుకున్నాను... నాకంటే తక్కువ సంపద ఉన్న ఇంట్లోని పిల్లనే పెళ్ళి చేసుకోవాలని నిశ్చయించుకున్నాను. మా కంటే ఏ విధంగానూ మీరు పై అంతస్థులో లేరు అని రూఢిపర్చుకునేందుకే... మీ ఆస్తి వివరాలు తెలుసుకున్నాను"

కృష్ణమాటలకు ఇద్దరూ తెల్లబోయారు!

రావులపాటి సీతారాంరావు